
# చోటువుంది




వెన్నెల్లో కారు తళతళామెరుస్తోంది. కారు డోరుకు ఆనుకుని నిలబడి వెనక్కు చూస్తోంది మాలతి. దూరంనించి ఎవరో గుంపుగా మాట్లాడుకుంటూ వస్తున్నట్టు అస్పష్టంగా కనిపించింది.

డ్రయివర్ శివపాదం అప్పటికి అరగంటనించీ ఇంజన్‌తో కుస్తీ పడుతున్నాడు.

చల్లగా వుంది. చలిక్రమంగా ముదురుతోంది. డిసెంబర్‌నెల చివరిరోజులు. అంత చలిలోకూడా శివపాదం షర్టు చెమటతో తడిసిపోయింది.

మొహాన్ని చేత్తో తుడుచుకుంటూ "లాభంలేదు మేడమ్... స్టార్టయ్యేలా లేదు" అన్నాడతను.

"మైగాడ్..." అంటూ గుండెలమీద చెయ్యివేసుకుంది మాలతి.

ఒక విధమయిన భయంతో ఆమె కళ్లు పెద్దవయినాయి.

"ఇప్పుడేమిటి చెయ్యటం? దాదాపు మైలుదూరం వెళితే గానీ వూరు రాదు. అయినా పల్లెటూరు. టౌనుకు వెనక్కు వెళ్లాలంటే తొమ్మిది మైళ్లు వెళ్లాలి. దగ్గరి దోవనీ, త్వరగా వెళ్లిపోవచ్చునీ ఆదారివెంట తీసుకు వచ్చాడు శివపాదం.

టైము చూసింది మాలతి.

పదిగంటలు కావస్తోంది.

"ఏం చేద్దాం శివపాదం?" పమిటను భుజంచుట్టూ తిప్పుకుంటూ అడిగింది మాలతి.

నవ్వేడతను. "ప్రయత్నం చేస్తాను. స్టార్టయితే వెళ్లిపోతాం. లేకపోతే తెల్లవారేవరకూ ఈ కార్లోనే" అన్నాడు.

మాలతి విసుక్కుంది.

"నువ్వే ఇదంతా చేసింది. ఇదే మెయిన్ రోడ్డయితే యే బస్సులోనో వెళ్లేదాన్ని. ఈ రూటులో లారీకూడా వచ్చేట్టు లేదు" అన్నది కోపంగా.

శివపాదం మాట్లాడలేదు. ప్యాంటు జేబులోనించి చార్మినార్ సిగరెట్టు ప్యాకెట్టు తీసి సిగరెట్టు ముట్టించి గుండెలనిండా పొగ పీల్చాడు.

మాలతి ఆరాత్రి ఎలా గడపటమా అని ఆలోచిస్తోంది.

ఇంతలో కారు వెనుకవయిపు నించి ఎవరివో మాటలు వినిపించాయి.

వెనక్కు చూసింది.

అంతకుముందు తనకు దూరంగా కనిపించిన మనుషులే ఇప్పుడు దగ్గరకు వచ్చారు.

ఎనిమిదిమంది వున్నారు. ముగ్గురు ప్యాంట్లు తొడుక్కున్నారు. మిగిలినవాళ్లు ధోవతులు కట్టుకున్నారు. వాళ్లలో ఒకతను సిగరెట్టు కాలుస్తున్నాడు. వెన్నెల నీడ పడుతుండడంవల్ల వారి మొహాలు సరిగా కనిపించడం లేదు.

వాళ్లు కారు దగ్గరకు వచ్చారు.

కారు పక్కనే నిలబడిన మాలతిని, డ్రయివర్‌ను అదోలా చూశారు.

"చెడిపోయిందా?" ఒకాయన అడిగాడు.

"ఊ" అన్నాడు శివపాదం.

కారును దాటి కొంచెం ముందుకు వెళ్లారు.

"వీళ్లలో ఎవరికయినా మెకానిజం తెలుసునేమో" అన్నది మాలతి.

"ఈ పల్లెటూరి వాళ్లకా?!" పెద్దగా నవ్వేడు శివపాదం. ముందుకు వెళుతున్న వాళ్లు

ఆగిపోయేరు.

వాళ్లలోనించి ప్యాంటు వేసుకున్నతను కారు దగ్గరకు వచ్చాడు.

సిగరెట్టు దమ్ము లాగబోతూ ఆగిపోయేడు శివపాదం.

అతను మాలతి దగ్గరగా వచ్చి "మీరు మాలతి కదూ?" అనడిగాడు.

ఆశ్చర్యపోయింది మాలతి.

అతనికేసి పరిశీలనగా చూసింది. వెన్నెల వెలుగు అతని మొహంమీద సూటిగా పడుతోంది.

అతన్ని గుర్తుపట్టింది.

"మీరు"

"విశ్వనాథంని" అన్నాడతను చిరునవ్వుతోనే.

మాలతికి చెప్పలేనంత సంతోషం కలిగింది. వెంటనే మాట రాలేదు.

"మీరు ఇక్కడ వుంటున్నారా?" తర్వాత అడిగింది.

"అవును. ఈ వూరి హైస్కూల్లో ఉద్యోగం చేస్తున్నాను". అన్నాడతను.

దాదాపు యేడేళ్ల తర్వాత అతన్ని కలుసుకోవడం. అతనిలో చాలా మార్పు వచ్చింది. కొంచెం లావయినాడు. హుందాగా వున్నాడు.

ఇన్నేళ్ల తరువాత విశ్వనాథాన్ని తను ఇలా కలుసుకుంటుందని కలలో నయినా వూహించలేదు.

"ఎక్కడినించి వస్తున్నారు?" అడిగాడు విశ్వనాథం.

"టవున్నించి. మా ఫ్రెండ్ ఇంట్లో ఓ ఫంక్షనుంది. దానికి ఎటెండయి దగ్గరి రూటని వస్తుంటే కారు ఇక్కడ ట్రబులిచ్చింది" అన్నది మాలతి.

"ఐతే ఈ రాత్రికి మా ఆతిథ్యం స్వీకరించండి" అన్నాడు విశ్వనాథం.

"ఈ రాత్రి ఎలా గడపాలా అని ఆలోచిస్తున్నాను. దేవుడిలా మీరు కనిపించారు. పదండి వెళదాం... శివపాదం... డోర్స్ లాక్‌చెయ్... వెళదాం" అన్నది మాలతి.

"మీరు వెళ్ళండి... నేను ఇంకా ట్రయ్ చేస్తాను. స్టార్టయితే కారు తీసుకు వస్తాను. మీ ఎడ్రసు చెప్పండి" అన్నాడు శివపాదం.

మాలతి- విశ్వనాథంకేసి చూసింది.

"ఊళ్లోకి ప్రవేశించగానే రామాలయం కనపడుతుంది. ఆ రోడ్డులో ఎడమవైపు రెండో ఇల్లు. చిన్న డాబా" చెప్పాడు విశ్వనాథం.

"వెళుతున్నాను" అని ముందుకు కదిలింది మాలతి.

తనూ కదిలాడు. అప్పటికే విశ్వనాథంతో వచ్చిన వాళ్లు చాలాదూరం వెళ్లిపోయారు.

"మేం పక్కవూళ్లో ఓ మీటింగ్‌కు వెళ్లి వస్తున్నాం. కొంచెం దూరంనించే మిమ్మల్ని చూశేను. కానీ మీరో... కాదో అనుకున్నాను" అన్నాడు విశ్వనాథం నడుస్తూ-

"నేను మిమ్మల్ని గుర్తుపట్టలేదు" అన్నది మాలతి. వెన్నెలలో వారిద్దరి నీడలూ పొడుగ్గా సాగుతున్నాయి.

అతని పక్కన అలా నడవడం మాలతికి గొప్ప అనుభూతిని కలిగిస్తోంది. జీవితాంతం అతని పక్కన అలాగే నడవాలని అనుకుంది. కానీ అంతస్థులభేదం మాలతి కోరికను క్రూరంగా మింగేసింది.

డిగ్రీలో ఇద్దరూ క్లాస్‌మేట్స్. ఆ రోజుల్లో విశ్వనాథానికి మాలతి పెట్టిన పేరు శాపగ్రస్తుడు. ఏదో శాపం పొందిన వాడిలా ఎప్పుడూ విచారంగా వుండేవాడతను. తలయెత్తి నడిచేవాడు కాదు. ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. చాలామంది అతని గురించి పట్టించుకోలేదు. కానీ మాలతి ఎప్పుడూ అతని గురించే ఆలోచించేది.

అతను జీనియస్. క్లాసులో ఎప్పుడూ ప్రతి సబ్జెక్టులోనూ ఫస్టు మార్కు అతనిదే. ఇందుగురించి చాలామందికి అతనిమీద బాగా అసూయగా వుండేది. అతడిని చూస్తే మాలతికి ఎంతో ముచ్చట కలిగేది. దేవుడు ఎంత దయలేని వాడు? అతడిని బాగా డబ్బున్న కుటుంబంలో పుట్టిస్తే ఎంత బావుండేది?" అనుకునేది.

విశ్వనాథం తండ్రి పంచాయితీ ఆఫీసులో గుమాస్తా. ఆయనకు ఎనిమిదిమంది పిల్లలు.

పేదరికమే విశ్వనాథాన్ని కుంగదీస్తోందని మాలతి ప్రగాఢమయిన నమ్మకం.

సగం దూరం నడిచిన తర్వాత వున్నట్టుండి మాలతి ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ "ఇప్పుడు మీరేం చేస్తున్నారు?" అని అడిగాడు విశ్వనాథం.

"హైద్రాబాద్‌లో ఓ కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నాను"

ఆ తర్వాత అతను మాట్లాడలేదు.

కొంచెం దూరంలో కనపడుతున్న ఇళ్లలోని దీపాలు రాక్షసుడి గుడ్లులా అగుపడుతున్నాయి.

అంతటా నిశ్శబ్దం.

ఆ వాతావరణంలో అలా అతనితో నడుస్తుంటే తను అప్పటివరకూ ఏదో పోగొట్టుకున్నట్టు మాలతికి అనిపించింది.

అవును. తను పొరపాటు చేసింది. తను తండ్రికి భయపడకుండా వుంటే ఎంతో బావుండేది.

"మీకు ఆరోజులు బాగా గుర్తున్నాయా?" అడిగింది.

"ఏరోజులు? కాలేజీ రోజులా?" అడిగాడతను.

"అవును. చాలా మధురమయినవి" అన్నది.

నవ్వేడతను అదోలా. షర్టు జేబులోనించి ప్యాక్ బయటకు తీసి ఓ సిగరెట్ వెలిగించాడు స్టైయిల్‌గా–

అతనికేసి ఆశ్చర్యంగా చూసింది మాలతి–

ఇతగాడిలో చాలా మార్పు వచ్చింది– అనుకున్నది.

ఒకనాటి సంఘటన ఆమె కనులముందు కదిలింది.

ఫస్టియర్‌లో వుండగా సరదాగా అరకులోయకు వెళదామని అనుకున్నారు క్లాసువాళ్లందరూ– మనిషికి ఇరవై రూపాయలు. అందరూ వొప్పుకుని డబ్బులు ఇచ్చేశారు– ఒక్క విశ్వనాధం తప్పించి. ఎవ్వరూ అతన్ని రమ్మని బలవంత పెట్టలేదు. కానీ అతని డబ్బులు కూడా తనే ఇచ్చి విశ్వనాధంని ఫోర్స్ చేసి తీసుకువెళ్ళింది మాలతి. అప్పుడు అతను ఎంతగానో మొహమాటపడి పోయేడు.

అప్పటిలో మూగవాడిలా అనిపించిన విశ్వనాధం ఇప్పుడు పల్లెటూరి రాజకీయాలగురించి ఉపన్యాసం ఇస్తున్నాడు.

ఆశ్చర్యంగా వింటోంది మాలతి. వింటూనే గతించిన సంఘటనలను గుర్తుకు తెచ్చుకుంటున్నది.

సెకండియర్‌లో విశ్వనాధం పరీక్ష ఫీజు కట్టలేదు. ఆ విషయం ఎలాగో మాలతికి తెలిసింది. తనే అతని ఫీజుకూడా కట్టింది. ఈ విషయం క్లాసులో తెలిసి చాలా గొడవ అయ్యింది. చాలామంది మాలతిపేరూ, విశ్వనాధం పేరూ బోర్డు మాదా, గోడలమీదా రాశారు. వాళ్ల రాతలు చూసిన తర్వాత తను ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకుంది. తను విశ్వనాధాన్ని ప్రేమిస్తోందా? విశ్వనాధం పేదరికం మీద తనకు సానుభూతితో పాటు అతనిమీద ప్రేమ కూడా వుందని రుజువయ్యింది. విశ్వనాధాన్ని తన లైఫ్ పార్టనర్‌గా అప్పటినించీ ఎన్నో కలలుకన్నది. కానీ వాస్తవ జగత్తులోకి వచ్చిన తర్వాత అంతస్తులు వారిమధ్య ఎత్తయిన గోడలుగా నిలిచాయి. ఫలితం– మాలతి ప్రేమ ఆమె గుండెల్లోనే నిలిచిపోయింది. చదువు అయిపోయిన తర్వాత పొట్టచేత పట్టుకుని ఎక్కడికో వెళ్లిపోయేడు విశ్వనాధం.

ఆ విశ్వనాధం మళ్లీ ఇప్పుడు ఇలా మాలతి పక్కనే నడుస్తున్నాడు వెన్నెల్లో. ఊళ్లోకి ప్రవేశించారు. వారిద్దరి నీడలూ కలుసుకుంటున్నాయి.

రామాలయం దగ్గరకు వచ్చారు. ఆలయం పక్కనే వున్న రావిచెట్టు- గాలి ఏదో చెబుతుంటే వింటున్నట్టు తలవూపుతోంది.

"మన క్లాసుమేటు రాజేశ్వరి కథలు రాస్తోందిట. తెలుసా?" అన్నది మాలతి అతనితో వున్నట్టుండి-

అతను నవ్వి తెలుసన్నట్టు తలవూపాడు.

ఒక ఇంటిముందు ఆగాడతను. గేటు నెట్టుకుని లోపలకు నడిచాడు. మాలతి అతడిని అనుసరించింది.

తలుపు తట్టాడు.

రెండు నిమిషాలకు తలుపు తెరుచుకుంది.

"ఇప్పుడయిపోయిందా మీటింగు" అన్నది అతడి భార్య కళ్లు నులుముకుంటూ-

"ఎవరొచ్చారో చూడు" అన్నాడతను నవ్వి.

వెన్నెల్లో నిలబడివున్న మాలతిని చూసి

"మాలతీ... నువ్వా!" అన్నది ఆశ్చర్యంగా రాజేశ్వరి- విశ్వనాధం భార్య. మాలతికి మరో షాక్.

"రాజేశ్వరీ"

"నువ్వెక్కడ కలిశావ్ ఈయనకు ఇంతరాత్రివేళ?"

చెప్పాడు విశ్వనాధం.

"చాలా విచిత్రంగా కలుసుకున్నాం" అన్నది మాలతి.

"నాకు చాలా సంతోషంగా వుంది. నిన్ను కలుసుకున్నందుకు. నీకారు చెడిపోవడం మంచిదే అయ్యింది" అన్నది రాజేశ్వరి.

"నువ్వు విశ్వనాధాన్ని చేసుకున్నట్టు నాకు తెలీదు" అన్నది మాలతి.

మంచంమీద కూర్చుని వుంది. ఆ మంచంమీదనే విశ్వనాధం కొడుకు ఐదేళ్లవాడు నిద్రపోతున్నాడు.

"వీడు మా సుపుత్రడు" అని చెప్పింది రాజేశ్వరి అంతకుముందుగానే-

"నీకే కాదు. మన ఫ్రెండ్స్‌లో ఒకరిద్దరికి తప్పించి ఈయన్ని చేసుకున్నట్టు ఎవ్వరికీ తెలీదు" అన్నది రాజేశ్వరి.

"డిగ్రీ చదివి ఈ పల్లెటూళ్లో ఎలా వుండగలుగుతున్నావ్?"

"ఊరికే ఎవరున్నారు? ఈ వూరి హైస్కూల్లో హిందీ టీచర్‌గా చేస్తున్నాను" చెప్పింది రాజేశ్వరి.

మాలతి గుండెలో కలుక్కుమంది. తను పోగొట్టుకున్నదేమిటో ఇప్పుడు స్పష్టంగా అర్థమయ్యింది. ఒకప్పుడు తను కోరుకున్న స్థానంలో తన క్లాసుమేటు రాజేశ్వరి వుండేసరికి మనసులో అశాంతి చెలరేగింది.

వంట ప్రయత్నం మొదలుపెట్టింది రాజేశ్వరి. వారించింది మాలతి. ఐనా రాజేశ్వరి వినలేదు. అప్పటివరకూ ముగ్గురూ కాలేజీ విషయాల గురించి మాట్లాడుకున్నారు.

"అన్నట్లు నువ్వు కథలు రాస్తున్నావుట గదా?" అనడిగింది మాలతి రాజేశ్వరిని.

"నా మొహం. నేను రాయడమా? ఆయనే రాసి నాపేరున పంపిస్తున్నారు. అంతా నేను రాస్తున్నాననే అనుకుంటున్నారు. ఇదిగో... ఈవారం పత్రికలో ఓ కథ పడింది. ఇవాళే వచ్చింది" అంటూ ఓ వార పత్రికను మాలతి చేతికిచ్చింది రాజేశ్వరి.

రాజేశ్వరి వేరేగా ఓ మంచం మీద పక్కవేసింది.

"ఐతే నువ్వు కాదూ?" అంటూ పత్రిక తెరిచింది మాలతి పక్కమీద వాలిపోయి.

విశ్వనాథం కథలు కూడా రాస్తున్నాడని తెలియగానే మాలతికి అతనిమీద అభిమానం మరింత పెరిగింది.

గబగబా పేజీలు తిప్పింది. ఒకచోట రాజేశ్వరి పేరు కనిపించింది. ఆ కథ పేరు- ప్రేమ కాదు.

మాలతి ఆత్రంగా చదవటం మొదలుపెట్టింది. పూర్తిగా చదివేసరికి తల గిర్రున తిరుగుతున్నట్టుగా అనిపించింది. తన మీద, ఒకప్పటి తన ప్రవర్తనమీద అసహ్యం కలిగింది. తర్వాత విశ్వనాథం మీదకూడా అసహ్యం వేసింది.

'ప్రేమకాదు' కథలో అతను రాసింది తన గురించే. ధనవంతులు తమ గొప్పతనాన్ని నలుగురికీ చాటుకోవటం కోసమే పేదవాళ్లకు సహాయం చేస్తారనీ, అంతకుమించి పేదవాళ్లంటే ధనవంతులకు ప్రేమ వుండదనీ, కేవలం జాలిమాత్రమే వుంటుందనీ రాశాడతను.

ఛీ... చివరకు ఇతను తనని ఇలా అర్థం చేసుకున్నాడా? తను విశ్వనాథం గురించి ఇప్పటివరకు ఎంతో ఉన్నతంగా వూహించుకున్నది. తన ప్రవర్తనను అతను కొంచెం అయినా అర్థంచేసుకుని వుంటాడనీ, అతని హృదయంలో తనకు కొంచెం చోటయినా వుంటుందనీ అనుకుంది. కానీ ఇప్పుడు అతని హృదయంలో ఒక రకమయిన అవహేళన తప్పించి మరేమీ లేదని అర్థమయింది.

ఆ కథ మాలతి గుండెలమీద మంచి దెబ్బనే కొట్టింది. ఆమె హృదయం బాధతో విలవిల్లాడిపోయింది. 'ఇంకా నయం. తన మనస్సులో వున్న ఆలోచనలను ఎప్పుడూ

అతనిముందు బయట పెట్టలేదు' అనుకుంది.

అక్కడ నిలవబుద్ధికాలేదు. పక్కమీద నించి లేచి వెళ్లిపోదామనుకుంది. కాని వీలవలేదు. తను విశ్వనాధం ఇంటికి రాకుండా వున్నా బావుండేదనిపించింది. కానీ ఇలా జరుగుతుందని ఎవరికి తెలుసు?

"కథ బావుందా?" అడిగింది రాజేశ్వరి.

"వూ" అన్నది మాలతి.

"ఇంకేమిటి విశేషాలు? మీ కాలేజీ కబుర్లు చెప్పు" మాలతి వైపుకు తిరుగుతూ అడిగింది రాజేశ్వరి.

మాలతి ఏదో మాట్లాడబోయింది. ఇంతలోనే కారు వస్తున్న చప్పుడు వినిపించింది. గబుక్కున మంచంమీద నించి లేచి నిలబడింది.

"ఏమిటి?" అడిగింది రాజేశ్వరి.

"కారు" అంటూ తలుపు గడియతీసి బయటకు పరుగు దీసింది మాలతి.

గేటు తీసుకుని బయటకు రాగానే రామాలయం దగ్గరగా వచ్చిన తన కారు కనపడింది. మాలతికి ఎంతో ఆనందమయింది. ఆ క్షణంలో శివపాదం తన పాలిట దేవుడిలా కనిపించాడు.

బయట నిలబడివున్న మాలతిని చూసి కారాపాడు.

"మీరింకా నిద్రపోలేదా?" నవ్వుతూ అడిగాడు శివపాదం.

"చప్పుడు విని వచ్చాను" అన్నది.

రాజేశ్వరి, విశ్వనాధం బయటకు వచ్చారు.

"ఇకనేను వెళతాను" అన్నది మాలతి.

"ఇంత రాత్రివేళా!" అన్నది రాజేశ్వరి.

"అవును. వెన్నెలగానే వుంది గదా... కారు ట్రబులివ్వకుండా వున్నట్లయితే వెళ్లేదాన్ని కాదూ" అంటూ డోర్ తీసుకుని లోపలకు ఎక్కి కూర్చుంది.

"మీ హ్యాండుబాగ్ లోపలే మరచిపోయినట్టున్నారు" అంటూ గబగబా లోపలకు వెళ్లాడు విశ్వనాధం.

"అవును" అన్నది మాలతి అలాగే కూర్చుని. రెండు నిముషాల తర్వాత అతను తిరిగివచ్చి బేగ్‌ని మాలతికిచ్చాడు. మాలతి బ్యాగ్ తెరిచి అందులోనించి వందరూపాయల నోటు తీసి "బాబుకి ఏదయినా కొనిపెట్టు" అని రాజేశ్వరికి ఇవ్వబోయింది.

రాజేశ్వరి తీసుకోలేదు.

"ఫరవాలేదు తీసుకో... నేనేం పరాయిదాన్ని కాదు" అని బలవంత పెట్టింది మాలతి.

అయిష్టంగానే తీసుకుంది రాజేశ్వరి.

"వెళతాను"

"మంచిది" అన్నది రాజేశ్వరి.

విశ్వనాథం మాట్లాడలేదు. మవునంగా గేటుదగ్గర నిలబడి వున్నాడు.

ఓమారు అతనికేసి చూసి "పోనివ్వు శివపాదం" అన్నది.

ముందుకు కదిలింది కారు.

రాజేశ్వరి చెయ్యి వూపింది.

సందు మలుపు తిరిగి చెరువు కట్ట మీదికి మళ్లింది కారు. రివ్వున చలిగాలి కొట్టింది.

తలమీదికి లాక్కోవడానికి పమిటను సరిచేసుకుంటున్నప్పుడు మాలతికి వొళ్లో వున్న కాగితం చేతికి తగిలింది. వందరూపాయల నోటేమో! ఇంతకుముందు హ్యాండుబాగ్ తెరిచినప్పుడు పడిపోయిందేమోనని చేతికి తీసుకుంది.

కాని కాదు– నోట్సులో నించి చించిన తెల్ల కాయితం. దానిమీద పెద్ద పెద్ద అక్షరాలు.

ఎక్కడిదీ కాగితం?

డోర్ దగ్గరకు జరిగి బయటనించి పడుతున్న వెన్నెల్లో ఆ అక్షరాలను చదివింది.

– మనగురించి రాజేశ్వరి హృదయంలో వున్న అపోహలను తొలగించటానికి– కేవలం ఆమె తృప్తి కోసమే 'ప్రేమకాదు' కథను రాశానని మీరు నమ్మితే కృతజ్ఞుడిని–విశ్వనాథం–

మాలతి హృదయం సంతోషంతో పొంగిపోయింది.

'విశ్వనాథం... మైడియర్" అని ఆ కాగితాన్ని ముద్దు పెట్టుకుని హ్యాండ్ బ్యాగ్‌లో భద్రంగా దాచుకుంది మాలతి.

(డిసెంబర్ 1979 స్వాతి మాసపత్రికలో ప్రచురితం)